

# కథా కౌముది

## వానర వీరుడు - అరిపిరాల సత్యప్రసాద్

ఆ రోజు కేతకి మనసు మనసులో లేదు. ఆ రోజు హనుమంతుడు అశోకవనానికి రెండొవసారి వస్తున్నాడట ...!! మునుపు వచ్చినప్పుడు రాక్షస స్త్రీలందరిని మాయలో ముంచి, నిద్రపోనిచ్చి కేవలం సీతమ్మను మాత్రమే కలిసి వెళ్ళాడు. ఈసారి అలాకాదు, అందరూ మేల్కొని ఉండగానే, అందరూ చూస్తుండగానే వస్తాడట.!! తాను హనుమంతుణ్ణి మళ్ళీ చూడబోతోంది.!! ఈ సారి అతనితో మాట్లాడాలి... తన మనసులో మాట చెప్పాలి... ఇలా ఆలోచిస్తుంటే కేతకికి ఆ రాత్రి నిద్రకూడా పట్టలేదు.

రావణ వధ నెరపిన వెంటనే శ్రీరాముడు విభీషణ పట్టాభిషేకానికి ఆజ్ఞ ఇచ్చాడు. అరణ్యవాసం చేస్తున్నందున లంకానగరంలోకి అడుగుపెట్టనని, లక్ష్మణుడికి పట్టాభిషేక బాధ్యత అప్పచెప్పాడు. ఆంజనేయుడు స్వయంగా సకల నదీనదాల నీరు తీసుకునిరాగా, దేదీప్యమానంగా విభీషణ పట్టాభిషేకం జరిగింది. ప్రజలు, సామంతులు ఇచ్చిన అనేకానేక బహుమతులు, మణులు, రత్న మాణిక్యాలు తీసుకుని విభీషణుడు సముద్రతీరానికి చేరుకున్నాడు. ఆ కానుకలన్నీ రాముడికి సమర్పించి నమస్కరించాడు.

రఘునందనుడు నవ్వి - "విభీషణా.. అరణ్యవాసికి ఈ కానుకలేల..? నాకు నీవు ఇవ్వవలసినది వేరొకటి ఉన్నదయ్యా.." అన్నాడు.

"రామచంద్ర ప్రభూ... సీతామాతా క్షేమంగా ఉన్నది. వెంటనే మీ విజయవార్తను ఆ అమ్మకు పంపిస్తాను" అన్నాడు విభీషణుడు.

"నీవు ఇప్పుడు లంకా రాజ్య ప్రభువు. నీ అనుమతి కోసమే వేచి ఉన్నాము. నీవు అనుమతిస్తే హనుమ ఆ కార్యం నిర్వర్తిస్తాడు.." అన్నాడు రాముడు.

"ఎంత మాట ప్రభూ..నేను రాజును కాదు. నీ దాసాను దాసుణ్ణి..మీ అనుజ్ఞ ప్రకారమే హనుమను పంపించండి.." అన్నాడు విభీషణుడు.

ఈ సంగతి ఎన్నిసార్లు చెప్పించుకుందో కేతకి. హనుమంతుడు అశోకవనానికి వస్తున్నాడు... ఎంతటి శుభవార్త.!! యుద్ధభూమి నుంచి నగరంలోకి రోజూ మరణ వార్తలు మోసుకొస్తున్న చారులు మొదటిసారి ఈ శుభవార్త తెచ్చారు. వెంటనే త్రిజటను కలవడానికి విభీషణ గృహానికి బయలుదేరింది.

దారిపొడువునా ఆంజనేయుడి గురించి ఆలోచనలే. అసలు ఆంజనేయుడి గురించి తప్ప ఈ మధ్య వేరేమి ఆలోచించట్లేదు కేతకి. అది ప్రేమ? అభిమానమా? భక్తా? ఏమో తనకే తెలియదు. అతను ఆజన్మ బ్రహ్మచారి అని తెలిసినప్పుడు మాత్రం కొంచెం బాధపడింది... కాని అతని మీద అనురాగం మాత్రం తగ్గలేదు. అతని కఠోర బ్రహ్మచర్యం గురించి విని మరింత గౌరవించింది. పూజించింది.

లంకా నగర వీధులన్నీ వెలవెలపోతున్నాయి. ప్రతి ఇంటి ముందు రాక్షస సైనికుల శవాలు, వాటి వెనక విధవలై, అనాధలై భోరున విలపిస్తున్న వారి కుటుంబ సభ్యులు. నాటి లంకాపురీ విభవమ్ము నేడు మచ్చుకైనా కానరావటం లేదు.

"అసలు ఆ రోజు ఆంజనేయుడు వచ్చి ఈ నగరాన్ని తన వాలముతో తగలపెట్టినప్పుడే ఈ నగరం కాంతిహీనమైనది. ఈ నాటి అగ్ని కీలకల్లో తగల బడిన మొండి గోడలు అదుగో ఇప్పటికీ కనిపిస్తున్నాయి.. ఒక్క కోతి కారణంగా మయుడిచే నిర్మించిన ఈ మహా నగరం ఇలా బూడిద పాలౌతుందని ఎవ్వరూ, ఏనాడు ఊహించి ఉండరు..." అలా ఆలోచిస్తూ పురవీధుల్లోకి అడుగుపెట్టింది కేతకి.

"అదుగో ఇక్కడే కదూ.. ఆనాడు ఆ వానర వీరుణ్ణి బ్రహ్మాస్త్రంతో బంధించి ఈ వీధుల్లోనే కదూ నడిపించాడు మేఘనాధుడు? అప్పుడే తాను ఆ వీరుణ్ణి మొదటిసారి చూసింది. ఎలా ఉన్నాడు..? బంధించారన్న దిగులులేదు, రొమ్ము విరుచుకుని, చేతులు వెనక్కి పెట్టుకుని, నగరంలో వీధి వీధిని పరికించి చూస్తూ, వాలాన్ని ఝుళిపిస్తూ, రామ మంత్రాన్ని జపిస్తూ, మధ్య మధ్యలో తనని చూడటానికి వచ్చిన జనులను వానర చేష్టలతో భయపడుతూ... " ఆలోచిస్తూనే అనుకరిస్తోంది కేతకి. చేతులు వెనక్కి పెట్టుకుని, రొమ్ము విరుచుకుని, తల ముందుకు వంచి కోతిలా పళ్ళు చూపిస్తూ "గుర్ర్.. గుర్ర్" అంటోంది.

"ఏమిటే ఇది కేతకీ.. కేతకీ." చేతులు పట్టుకుని ఊపింది కాళనామి. ఆమె కేతకి స్నేహితురాలు. "ఏమిటే ఇది మళ్ళీ ఆ తోక వీరుడు గురించేనా.." అంది కవ్విస్తూ.

"ఏయ్ .. కాళ.. నా మారుతినేమైనా అన్నావో" వేలు చూపించింది కేతకి.

"ఏమిటి... ఆ బ్రహ్మచారి నీ మారుతి ఎట్లైనాడమ్మా?"

"వీరుణ్ణి అభిమానించడం తప్పా... నేనేమి ఆయన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పలేదే"

"సరేలేమ్మా.. నీతో నాకెందుకు.. నాకు అవసరమైన పని ఉంది వస్తా"

"ఏమిటే ఆ పని?"

"యువరాణి త్రిజటమ్మగారి దగ్గరికే.. నాకు ఆ అశోకవనంలో ఏదైనా పని చెప్పమని"

"అశోక వనమేమిటే..?"

"నీకు తెలియదులే.. ఆయన అక్కడికే వస్తున్నాడు" చెప్పి పరుగెత్తింది కాళనామి.

కేతకి వెళ్ళేసరికి త్రిజట సీతను అలంకరించడానికి నగలు సిద్ధం చేస్తోంది. నగరంలో ఉన్న సమస్త ఆభరణాలను తెప్పించింది.

"సీత మేని ఛాయ ముందు ఈ బంగారం దిగదుడుపే... ఇదిగిదిగో ఈ నీల చీర చూడండి... అయ్యో ఇది రాముని మేని ఛాయముందు దిగదుడుపే.." అంటూ ఒక్కటే సవరిస్తోంది. కేతకి రావటం చూసి -

"ఏమిటే ఇప్పుడా రావటం... పద పద... వెళ్ళి సీతను తీసుకెళ్ళే రథం అలంకరించు.." అంటూ పనిలో మునిగిపోయింది. కేతకి హతాశురాలైంది. ఎలాగైనా అశోకవనం చేరాలి, అక్కడ హనుమంతుణ్ణి చూడాలి.

"యువరాణిగారు.." అన్నది.

"ఏమిటే....?"

"అమ్మా.. నేను అశోకవనానికి వెళతానమ్మా.. సీతమ్మను అలంకరిస్తాను..: అన్నది చిన్నగా.

"ఓహో... హనుమయ్య అకడికి వస్తాడనా? బాగానే ఉంది.. ఆయనంటే అంత ఇష్టం ఉన్నదానివి, ఆయన స్వామి భక్తి గురించి తెలిసినదానివి, నేను చెప్పిన దానికి ఎదురు చెపుతావా?" అంది నవ్వుతూ.

"అమ్మా... అమ్మా .. కాదనకండమ్మా" ప్రాధేయపడింది కేతకి.

"సరేలే... ఈ నగలు తీసుకెళ్ళి జానకీదేవిని అలంకరించు.. అశోకవనంలో" అన్నది చివర్లో వత్తి పలుకుతూ.

కేతకి నమస్కరించి, చిన్నగా నవ్వుతూ అశోకవనం వైపు సాగింది. వెనకే పరిచారకులు రకరకాల మణిహారాలు, కేయూరాలు, కడియాలు ఇంకా ఎన్నెన్నో చిత్రమైన రంగులు కలిగిన వస్త్రములు తీసుకుని ఆమెను అనుసరిస్తూ కదిలారు.

కేతకి నడుస్తూ ఆలోచిస్తోంది -

"త్రిజటమ్మగారు అలా అంటారుగాని ... ఆమెకు తెలియదా తనకి హనుమంతుడంటే ఎంత ఇష్టమో... ఎన్నిసార్లు ఆమె దగ్గరకు వెళ్ళి హనుమంతుడి కథలు చెప్పలేదు... ఆ రోజు లంకా నగర రక్షకి లంఖిణిని ఎవరో చంపేశారన్నప్పుడు తాను ఆశోకవనంలోనే ఉంది. త్రిజట ఆ రోజు తన స్వప్న వృత్తాంతం వివరించి, ఎవరో వానరవీరుడు వస్తాడని, లంకానగరం నాశనం తప్పదని చెప్పింది కదా అప్పుడేకదా తను మొదటిసారి వాయునందనుడి గురించి వినడం... ఆ తరువాత ఆయన రావటం లంకా దహనం కావించడం... ఆహా.. వాలానికి నిప్పు పెడితే నిబ్బరంగా గాలిలోకి లేచి ఆ ప్రాకారం మీదకి దుముకుతూ, తోకని పెంచుతూ ఈ లంకా ప్రజలను గగ్గోలు పెట్టిస్తుంటే, తనొక్కతే సంభ్రమంగా అలాగే నిలుచుని తదేకంగా అతన్ని చూసిన క్షణాలు.. ఎంత కాలమైనా మరుపుకు రావుకదా.!! ఆనాడు ఆయనకు ఏ హాని కలగకూడదని సీతమ్మతోపాటే తాను అగ్ని దేవుడిని ప్రార్థించింది... అప్పుడు ఆ వీరుడు తనను చూశాడా? ఏమో.." ఇలా ఆలోచిస్తూనే అశోకవనం ముందున్న ఫలతోటలోకి చేరుకున్నారు పరివారమంతా.

కొంతకాలం క్రిందట ఎంత మనోహరంగా ఉండేదా తోట. ఎన్నో లోకాలతో యుద్ధాలు జరిపి, అన్ని లోకాల చిత్ర విచిత్రమైన ఫలాలను, పుష్పాలను రావణుడు స్వయంగా మక్కువతో తెచ్చుకుని పెంచిన తోట అది. ఎప్పుడూ దోరమాగిన ఫలాల సువాసనలు వెదజల్లుతూ ఆఘ్రాణింపుకే మైమరపాటునిచ్చే మనోహరమైన తోట. మరి ఈనాడు -

విరిగిన ప్రాకారాలతో, ఎక్కడికక్కడ పడిపోయి ఎండిపోయిన మహా వృక్షాలతో, దారికి అడ్డంగా పడివున్న మహా పర్వతాలవంటి రాళ్ళతో.. ఇదంతా ఆ వానర వీరుడి పనేకదూ.!! అతను చెట్లను పెళ్ళగించిన చోట ఇప్పుడు చిన్న చిన్న తటాకాలయ్యాయి. రాళ్ళు విసిరినప్పుడు దాని కింద పడిన రాక్షసులు ఆ రాతికిందే సమాధి అయిపోయి వున్నారు. కొన్ని బండలకింద ఇప్పటికీ రథ శకలాలు ఉన్నాయి.

కేతకి అక్కడే పడివున్న ఒక మామిడి చెట్టు దగ్గరకు వెళ్ళింది. చెట్టును వేర్లతో సహా పెళ్ళగించినప్పుడు హనుమంతుడు చేతులు పడిన చోట నొక్కుకు పోయి ఉంది. కేతకి ఆ అచ్చులమీద చిన్నగా తాకింది. ఒళ్ళంతా పులకరించినట్లైంది. భక్తిగా నమస్కరించింది.

"ఏం వీరుడివయ్యా? మా రాక్షసుల చేతులలో చిత్ర విచిత్రమైన ఆయుధాలు చూశాను. కానీ నీలా చెట్లను, బండరాళ్ళను ఆయుధాలు చేయగలిగినవాడిని ఇంతవరకు ఎరుగను..."

రామరావణ యుద్ధంలో హనుమంతుడు చేసిన పోరు జ్ఞాపకం వచ్చింది ఆమెకి. యుద్ధంనుంచి రోజు తిరిగొచ్చిన చారులు యుద్ధ విశేషాలను పూసగుచ్చినట్లు చెప్పేవారు. వారిని అడిగి ప్రత్యేకంగా హనుమంతుడి సంగతులు చెప్పించుకునేది కేతకి. అవే విషయాలు గుర్తుకొస్తున్నాయి. వెంట వస్తున్న పరిచారకులకు ఆ విశేషాలు చెప్పసాగింది -

"ధూమరాక్షసుడు పశ్చిమ ద్వారం గుండా వెళ్ళినప్పుడు అక్కడ కాలయముడిలా నిలబడ్డాడట హనుమంతుడు. పెద్ద బండరాయిని ఎత్తి అతని రథం మీద విసిరాడట. రథం తునాతునకలైంది. ధూమరాక్షసుడు పరుగు లంకించుకున్నాడు... అతని వెంటే హనుమంతుడు కూడా మరో పెద్ద రాతిని చేతులతో పైకెత్తి అలాగే పరుగెత్తాడట. రాక్షసుడు గదతో కొట్టినా చలించలేదట.. ఎన్నో యోజనాలు అలా పరుగెత్తి ధూమరాక్షసుడు అలిసిపోతే వాడి నెత్తిన ఆ రాయిని విసిరి చంపేశాడు ... తెలుసా?" అన్నది.

"అమ్మయ్యో..ఎంతటి వీరుడో" అన్నది ఒక రాక్షసపడుచు.

"మరి ఏమనుకున్నావు? మరోనాడు అకంపనుడు పధ్నాలుగు బాణాలతో హనుమంతుడి గుండెల్ని చీలిస్తే కూడా లెక్క చేయక పెద్ద చెట్టుతో వాడి తలపై మోదాడట.. నీలుణ్ణి చంపబోయిన నికుంభుణ్ణి పిడిగుద్దులతో చంపాడు, త్రిశిరుడు కోపగించి వస్తే అతని కత్తితో అతనినే చంపాడు.. ఆనాడు జంబుమాలిని శిరస్సును సైతం గదతో వేయివక్కలు చేయలేదా?" తదాత్మ్యయంగా చెప్పుకొచ్చింది కేతకి.

"అయితే అమ్మా... రావణుడి రాజ్యంలో పుట్టి శతృవైన హనుమంతుణ్ణి ప్రేమిస్తున్నారే..!?"

"నోరు ముయ్యండి.. ప్రేమకాదిది.. ఆరాధన.. ఆయన నాకు దైవంతో సమానం" కోపంగా అంటూ బిరబిరా నడిచింది కేతకి.

అక్కడ అశోకవనంలో సీత కూర్చుని ఉంది. రామలింగనాభిలాషియై క్షణ క్షణం పరితపించిపోతోంది. ఆ రాత్రంతా ఆమె నిద్రపోలేదని ఆమె కళ్ళు చెపుతున్నాయి. శీతలపవనాలతో ఆమెను నిద్రింపచేయాలని ప్రయత్నిస్తూ అశోక చెట్లు అలసిపోయాయి. రావణ సంహారం గురించి త్రిజట చెప్పగానే ఆనందంతో త్రిజటను గట్టిగా కౌగలించుకుంది."రాముడొస్తున్నాడు.. నా రాముడొస్తున్నాడని.." ప్రతి చెట్టుకీ చెప్పుకుంది. కీరవాణి రాగాల పక్షులను చేరదీసి రామనామం చెప్పించి మురిసిపోయింది. ఇక రాత్రేమిటి పగలేమిటి.. ఎప్పుడెప్పుడు రాముడు వస్తాడా.. ఎప్పుడు తాను అహల్య అయ్యి పాదాలు తాకుతానా, ఎప్పుడు తాను గుహుడు అయ్యి పాదాలు కడుగుతానా అని ఎదురు చూస్తోంది.... రామవామాంకాన కూర్చుని ఎప్పుడు ఆ పవిత్ర కరస్పర్శకు పరవశురాలిని అవుతానా అని ఎదురు చూస్తూ నిద్రను ఎప్పుడో తరిమేసింది.

కేతకి సీతను పరిశీలనగా చూసింది. నిద్రలేమితో ఆమె కళ్ళు మగతగా ఉన్నాయి. నెమ్మదిగా మూసుకుపోతున్న కళ్ళతో ఒక్క క్షణం నిద్రలోకి జారుకుని, ఆ ఒక్క క్షణంలోనే రాముడు వచ్చేశాడేమో అన్న ఆతృతతో చటుక్కున కళ్ళు తెరిచి చుట్టుపక్కల చూస్తోంది. కేతకి నవ్వుకుంది.

"ఆరోజు ... హనుమంతుడు సంజీవని తేవడానికి ఉత్తరానికి వెళ్ళినప్పుడు... తాను ఇలాగే రాత్రంతా నిద్రపోకుండా ఎదురు చూసింది. గగన మార్గంలో తిరిగి వచ్చే హనుమంతుణ్ణి అనుకరిస్తూ.... ఎప్పుడెప్పుడు వస్తాడా అని దృష్టంతా ఆకాశం మీదే నిలిపి ఉంచింది... అంతలో సూర్యోదయం... సూర్యుడు ఉదయిస్తే లక్షణుడు బతకడు... లక్ష్మణుడు లేకపోతే రాముడు జీవించడు... స్వామి కార్యం నిర్వర్తించలేకపోయాడన్న అపఖ్యాతి హనుమంతుడికి వస్తుంది. ఆ విషయం తలుస్తూ సూర్యుణ్ణి నిందిస్తూ భోరున విలపించింది... తీరా చూస్తే అది సూర్యబింబం కాదు... సంజీవని బదులు ఆ పర్వతాన్నే పెకలించుకుని హనుమంతుడు.. ఆ పర్వత కాంతిలో వెలుగుతూ... ఓహ్... ఎంతటి మనోహర దృశ్యమది.!!"

"అమ్మా కేతకమ్మగారు ఏమిటమ్మ మీ పరధ్యాన్యం?" అంటూ పిలిచారు పరిచారికలు.

కేతకి తేరుకుని తెచ్చిన నగలను, పట్టువస్త్రాలను సీత ముందు పెట్టించింది. సీతకు నమస్కరించి - "అమ్మా మిమ్మల్ని అలంకరించమని యువరాణి త్రిజటగారి ఆజ్ఞ." అన్నది.

సీతమ్మ నవ్వింది. అలంకార భూషణాదులు తిరస్కరించింది. తన భర్త నార వస్త్రాలతో ఉంటే తాను అవే ధరిస్తానని పట్టుబట్టింది.

"అమ్మా ఇంతకాలానికి నీ భర్తను చూడబోతున్నావు.. కొంతైనా అలంకారం లేకపోతే ఎట్లాగమ్మా" అని నచ్చచెప్పబోయింది కేతకి.

సీతమ్మ నవ్వి నాడు హనుమంతుడు తెచ్చిచ్చిన అంగుళీయకము తీసి చూపించి, తన వేలికి తొడుగుకుంది. కేతకి సంభ్రమంగా చూసింది సీతారాముల అనురాగానికి చిహ్నమైన ఆ అంగుళీయకము తళుక్కున మెరిసింది. ఆ ఉంగరము తెచ్చి ఇచ్చి ఈనాడు వారి సమాగానికి కారణమైన ఆంజనేయుణ్ణి తలచుకుని కేతకి భక్తిగా నమస్కరించింది.

ఇంతలో వందిమాగధులు వచ్చి నిలబడ్డారు. కేతకి గుండె వేగంగా కొట్టుకుంది.

"సీతారామసేవాపరాయణ... మహాబలశాలి... అంజనీపుత్ర.. వాయునందన... హనుమనామభూషణ వేంచేస్తున్నారు.." అంటూ ప్రకటించారు.

సీత దిగ్గున లేచి నిలబడింది. కేతకి అనాలోచితంగా నాలుగడుగులు ముందుకు ఉరికి హనుమంతుణ్ణి చూడటానికి తహ తహలాడింది.

"ఎందుకమ్మా అంత తొందర?" అన్నారు పరిచారికలు.

"నీకు తెలియదే.. ఒక్కసారి ఆయన్ని చూస్తే చాలు... ఆ వీరుడూ..." చెపుతున్నదల్లా ఆగిపోయింది. అక్కడికి కొన్ని అడుగుల దూరంలో..

అదుగో అతనే వస్తున్నాడు... చేతిలో గద, సూక్ష్మ దృష్టి, ఆజానుబాహువులు, కండలు తిరిగిన శరీరం.. ఠీవిగా.. దర్జాగా.. ఆయన వేసే ఒక్కొక్క అడుగుకి భూమి కంపిస్తున్నట్లుంది... నిరంతర రామనామ గానం... అదిగో అదిగో అతనే అంజనా దేవి తపఃఫలం... హనుమంతుడు.

కేతకి అలాగే చూస్తూ ఉంది. హనుమంతుడు కొంత దూరమునుంచే సీతను చూశాడు. అతనిలోని వానరుడు నిద్రలేచాడు. సంతోషంతో దుముకుతూ.... "అమ్మా.. సీతమ్మా.. జయం తల్లీ... విజయం.. నీ కష్టాలు తీరాయి మాతా..." అంటూ వచ్చాడు. సీతమ్మ పాదాలకు నమస్కరించాడు.

"అమ్మా నాడు నిన్ను దర్శించి నీ క్షేమ వార్తను రాముడికి తెలిపే భాగ్యం నాకు కలిగింది. ఈనాడు యుద్ధానంతరం రామ క్షేమ వార్తను నీకు తెలియజేసే భాగ్యం కూడా నాకే దక్కింది తల్లీ... నా జన్మ చరితార్థమైంది." అన్నాడు కన్నీళ్ళ పర్యంతమౌతూ.

సీతమ్మ కూడా కన్నీళ్ళు వర్షిస్తుండగా – "నాయనా... ఈ శుభవార్త చెప్పిన నీకు ఏ బహుమతి ఇవ్వలేని నిర్భాగ్య స్థితిలో ఉన్నాను.. నిన్ను నా బిడ్డగా స్వీకరించడం తప్ప ఇంకేమీ ఇవ్వలేను నాయనా" అన్నది.

"అమ్మా.. నీవెప్పుడూ మా సీతమ్మ తల్లివేనమ్మా.." అంటూ ఆమె చుట్టూ కలియచూశాడు. ఆమె పక్కగా కేతకి తన పరివారముతో నిలబడి ఉంది. వారంతా అక్కడ జరుగుతున్న సంభాషణకు ఆర్ద్రతకు లోనై స్థాణువుల్లా నిలబడిపోయారు.

"ఓహో ... రాక్షసులు అంతమైనా ఇంకా నిన్ను భయపెట్టి... రావణుడికి లొంగమని నిన్ను ప్రలోభ పెట్టిన ఈ రాక్షసకాంతలు ఇంకా బ్రతికే ఉన్నారా" అంటూ హుంకరించి గద పైకెత్తి వారి మీదకు దూకపోయాడు. ఆయన కళ్ళు పెద్దవి అయ్యాయి.. ఆవేశంతో ఊగిపోతున్నాడు.. బలంగా పెదవులను బిగించాడు... చేతులపై, వక్షస్థలం పైన కండలు ఉబికి వస్తున్నాయి...

అతని భీకరాకారం చూసి పరిచారికలంతా భయంతో చెల్లాచెదురయ్యారు. ఎటు దిక్కు వారు అటు పరుగులు తీశారు. కేతకి ఒక్కతే అక్కడ నిలబడిపోయింది. నిశ్చలంగా, నిర్భయంగా... హనుమంతుడి రౌద్రరూపాన్ని మనసారా ఆస్వాదిస్తూ పరిసరాలను మర్చిపోయింది.

"హనుమా ఆగు ఆగు నాయనా.." అంటూ సీత ఆపింది అతడిని. వీరంతా విభీషణుడి కూతురు త్రిజట పంపించగా నన్ను అలంకరించేందుకు వచ్చారు. వీరే పాపం ఎరగరు. అయినా నన్ను బాధించిన రాక్షసకాంతలు సైతం వారు రాజు ఆజ్ఞనే కదా పాటించారు.." అంటూ సర్ది చెప్పింది.

కేతకి తేరుకుని హఠాత్తుగా ముందు వంగి హనుమంతుడి పాదాలపై పడి నమస్కరించింది. హనుమంతుడు ఆమెను లేవనెత్తి –

"నా రౌద్ర రూపం చూసి మహా మహులే భయంకంపితులౌతారు.. నీవు చూస్తే పదహారేళ్ళు దాటని పసిపిల్లవి... నీవు నన్ను చూసి అంత ధైర్యంగా ఎలా నిలబడ్డావు.." అన్నాడు మారుతి.

"స్వామి.. నేను పుట్టిన దగ్గరనుంచి లంకానగర ఖ్యాతిని, రావణ పరివార వీరత్వాన్ని మాత్రమే విన్నాను. ఆ వీరులను సంభ్రమాశ్చర్యాలతో చూచాను... అటువంటి వీరులందరిని ఒక్క చేతితో మట్టికరిపించిన మీ వీరత్వానికి ముగ్ధురాలనైనాను... మిమ్మల్నే ఆరాధించాను.. పూజించాను.. మీరు నా దైవం.. అందుకే నాకు భయం వెయ్యలేదు.. ఈ లంకానగర ఖ్యాతిని సమూలంగా నాశనం చేసిన మీ వీరత్వం... మహాబలశాలురైన రాక్షసులను దురిమిన మీ రౌద్రం దర్శించుకునే భాగ్యం కలిగినందుకు ధన్యురాలనైనాను.." అంటూ నమస్కరించింది కేతకి.

"పిచ్చి దానా ... ఎంతటి అమాయకురాలవమ్మా? ఈ రాక్షస సంహారం చేసింది మా కోతిమూక అనుకున్నావా? ఇదంతా నా ప్రజ్ఞ అనుకున్నావా... రాక్షసులను తుదముట్టించినది రామనామమనే అస్త్రాలు, ఈ లంకను నాశనం చేసింది... నా తోకకి నిప్పు అనుకుంటున్నావేమో... అదికాదు.. ఇదుగో ఈ సీతమ్మ తల్లి కార్చిన కన్నీరు లంకా దహనం కావించింది.. అటువంటి ఈ సీతారాములను ధ్యానించు నీకు తప్పక శుభం కలుగుతుంది" అంటూ వెనుతిరిగాడు హనుమంతుడు.

కేతకి మనసులోనే సీతారాముల్ని ధ్యానించింది.